# సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 7 । అక్టోబర్ । 2024






**అభయారణ్యంలో సైక్లింగ్** 8లో▸

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవ్వాల్ అభయారణ్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సైక్లింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సైక్లిస్టులు పాల్గొన్నారు.

**నేడు పోలీసు శాఖ బతుకమ్మ సంబరాలు**

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో తెలిపారు. మహిళా సిబ్బంది, పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
34.0/24.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

## న్యూస్‌రీల్

### సాగునీరు విడుదల చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

తాంసి: మత్తడివాగు కుడికాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వడ్డాడి రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ప్రాజెక్టు పంప్‌హౌస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం కాత దశలో ఉన్న పత్తికి నీటి తడులు అందించకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. అలాగే శనగ సాగుకు సైతం సాగునీరు అవసరం ఉంది. పైపులైన్ ద్వారా నీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి పంటలకు సాగునీరందేలా చూడాలని కోరుతున్నారు.

### పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా అభిమాన్



అభిమాన్

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కనక అభిమాన్ నియామకమయ్యారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చించుఘాట్ బాలికల ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అభిమాన్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రాల పాటి ఉమాకర్‌రెడ్డి, సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.



డీఈవో కార్యాలయం

# విద్యాశాఖలో కాసుల లొల్లి!

- ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి డబ్బులు తీసుకున్నారని వాగ్వాదం
- ఓ అధికారి, ముగ్గురు ఉద్యోగుల మధ్య పంచాయితీ
- ఈ ఘటనలో బీపీ పెరిగి ఆస్పత్రిలో చేరిన ఓ ఉద్యోగి
- ఆలస్యంగా వెలుగులోకి..



ఓ ఉద్యోగి మరో ఉద్యోగికి వాట్సాప్ ద్వారా పంపిన మెస్సేజ్

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా విద్యాశాఖలో పలువురి తీరు మాత్రం మారడం లేదు. ఏదో ఒక విషయంలో రచ్చకెక్కుతున్నారు. వసూళ్ల పంపకాల విషయంలో గొడవలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనే ఇటీవల చోటు చేసుకుంది. ఓ అధికారి, మరో ఉద్యోగితో ఇద్దరు ఉద్యోగులు తీవ్రస్థాయిలో గొడవ పడ్డారు. తమకు తెలియకుండా ఫైల్‌లో సంతకం చేసి డబ్బులు తీసుకున్నారని వాగ్వాదానికి దిగారు. తమ సెక్షన్ ద్వారా వెళ్లాల్సిన ఫైల్‌ను మరో ఉద్యోగితో ఎలా సంతకం చేయిస్తారని.. ప్రైవేట్ పాఠశాల నుంచి ఎంత డబ్బులు తీసుకున్నారు.. మాకు రావాల్సిన వాటిని మీరెలా తీసుకుంటారని గొడవకు దిగారు. ఈ విషయం విద్యా శాఖ కార్యాలయంలో దావనంలా వ్యాపించింది. సదరు ఉద్యోగిపై గొడవకు దిగడంతో అతడు బీపీ పెరిగి అనారోగ్యం బారిన పడ్డాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**అసలేం జరిగిందంటే..**

జిల్లా కేంద్రంలోని బట్టిసావర్గాం పరిసర ప్రాంతాల్లో గల ఓ ప్రైవేట్ పాఠశాలకు సంబంధించి రెన్యూవల్ ముగిసింది. ఫైర్‌సేఫ్టీకి సంబంధించి పత్రాలు సమర్పించాల్సి ఉంది. పాఠశాలకు సంబంధించిన యాజమాన్యం ఫైల్‌ను డీఈవో కార్యాలయంలో సమర్పించారు. ఆ సెక్షన్‌కు సంబంధించిన కిందిస్థాయి అధికారి, క్లర్క్ అందుబాటులో లేకపోవడంతో మరో ఉద్యోగితో సంతకం చేయించి ఫైల్‌ను ఆర్‌జేడీకి పంపించారు. ఆ కార్యాలయం నుంచి ఇటీవల డీఈవో కార్యాలయానికి ఫైల్ వచ్చింది. తాము చూసే సెక్షన్‌లో మరో ఉద్యోగితో ఎలా సంతకం పెట్టిస్తారని ఆ ప్రైవేట్ పాఠశాల నుంచి ఎన్ని డబ్బులు తీసుకున్నారు.. మాకెందుకు చెప్పలేదంటూ కిందిస్థాయి అధికారి, క్లర్క్ గొడవకు దిగారు. వారం క్రితం ఈ ఘటన చోటుచేసుకోవడంతో కార్యాలయంలో రచ్చరచ్చ అయ్యింది. ఓ అధికారిని ఇద్దరు ఉద్యోగులు ప్రశ్నించడంపై మిగతా ఉద్యోగులు వారి తీరును చూస్తుండిపోయారు. వారికి సదరు అధికారి క్షమాపణ చెప్పినా వినిపించుకోలేదు. సదరు పాఠశాల యాజమాన్యానికి చెందిన వ్యక్తిని పిలిపించి వారి ఎదుట తాము ఎలాంటి డబ్బులు తీసుకోలేదని చెప్పించారు. ఈ క్రమంలో పాఠశాల యాజమాన్యానికి సంబంధించిన వ్యక్తి తాను ఓ నిఘా శాఖలో పనిచేస్తున్నానని, ఈ విషయం చెబితే విద్యాశాఖ పరువు పోతుందని వారికి నచ్చజెప్పారు. ఏసీబీకి పట్టిస్తానని హెచ్చరించడంతో వారు మిన్నకుండిపోయారు.

**గాడితప్పిన పాలన..**

విద్యాశాఖ కార్యాలయ పాలన గాడితప్పింది. కొంత మంది ఉద్యోగులు ఏ పని చేయాలన్నా.. ఎంతోకొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పలువురు బాధితులు పేర్కొంటున్నారు. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పలువురు ఉద్యోగులు ఆడిందే ఆటా.. పాడిందే పాట అన్న చందంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సెక్షన్‌ను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం తమకేమి పట్టనట్లుగా ఉండడంతో విద్యాశాఖ అభాసు పాలవుతోంది. గతంలోనూ పలువురు ఉద్యోగులు ప్రైవేట్ పాఠశాలల నుంచి డబ్బులు తీసుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, ఇటీవల కొన్ని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం పట్టించుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. అయితే ఆ సెక్షన్‌తో సంబంధం లేని ఓ ఉద్యోగి మరో ఉద్యోగికి వాట్సాప్ ద్వారా మెస్సేజ్ చేశారు. సంబంధం లేని వాటిలో ఎందుకు తలదూర్చుతున్నావు.. మీరే ఆ సెక్షన్ చూసుకోండి అంటూ హెచ్చరించడం కార్యాలయ వర్గాలతో పాటు జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరగా, కార్యాలయంలో అలాంటిదేమి జరగలేదని, విషయం తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

# పార్కు స్థలం కబ్జా..!



కబ్జాకు గురైన బల్దియా లీజు స్థలం

- అక్రమ అసెస్‌మెంట్‌తో సొంతం
- చర్యలకు బల్దియా వెనుకంజ
- అధికారుల తీరుపై విమర్శలు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు దానిపై గద్దల్లా వాలిపోతున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారు. రూ.10 కోట్ల విలువైన బల్దియాకు సంబంధించిన పార్కు స్థలాన్ని కబ్జా చేసిన ఓ వ్యక్తి దానికి అక్రమంగా అసెస్‌మెంట్, ఇంటి నంబర్ తీసుకుని విక్రయించేందుకు యత్నించడం గమనార్హం. కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని సంరక్షించాల్సిన మున్సిపల్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఖాళీగా ఉండటంతో కబ్జా**

ఆదిలాబాద్ పట్టణం 49వ వార్డు (భుక్తాపూర్)లోని 8వేల చదరపు అడుగుల స్థలాన్ని గతంలో ఓ సామిల్ కోసం మున్సిపల్ అధికారులు లీజుకిచ్చారు. పదేళ్ల క్రితం ఆ లీజు గడువు ముగియడంతో అప్పటి మున్సిపల్ చైర్మన్ దిగంబర్‌రావు పాటిల్‌గా ఉన్న సమయంలో మున్సిపల్ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కొన్నేళ్ల పాటు ఆ స్థలం ఖాళీగానే ఉంది. 2021లో ఆ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. అయితే అందులోని కొంత భాగంలో రూ.14లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ స్థలంపై కన్నేసిన ఓ అక్రమార్కుడు 1983లో పట్టా పొందినట్లుగా నకిలీ డాక్యుమెంట్ సృష్టించాడు. అదే డాక్యుమెంట్‌తో మున్సిపల్ కార్యాలయంలో అసెస్‌మెంట్ చేయించుకుని ఇంటి నంబర్ పొంది తన పేరిట చేసుకున్నాడు.

**అధికారుల ప్రమేయంపై అనుమానాలు**

కోట్లాది రూపాయల విలువైన మున్సిపల్ లీజు స్థలం కబ్జాకు గురి కావడంలో మున్సిపల్ అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో స్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ, మున్సిపల్ స్థలమా లేక ప్రైవేట్ స్థలామా అనే దాన్ని పరిశీలించి ఇంటినంబర్ జారీ చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఇవేమి పట్టించుకోకుండా ఇంటి నంబర్ జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.

**విచారణకు ఆదేశించాం**

మున్సిపల్ పార్కు స్థలం కబ్జాపై విచారణకు ఆదేశించాం. స్థలానికి సంబంధించిన రికార్డులు చూపుతున్న వ్యక్తి చెప్పే వివరాల ప్రకారం ఆ ఇంటినంబర్ పార్కు స్థలానిది కాదు. ఎక్కడో ఉన్న నంబర్‌ను పార్కు స్థలానిదంటూ చూపుతూ కబ్జాకు యత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని రెవెన్యూ అధికారిని ఆదేశించాం. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

# పోచమ్మకు నీరాజనం

- గంగనీళ్ల జాతరకు పోటెత్తిన భక్తజనం
- గోదావరిలో అమ్మవారి ఆభరణాల శుద్ధి
- దిలావర్‌పూర్ నుంచి సారంగాపూర్‌కు పాదయాత్ర
- అమ్మవారి నగలకు అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం
- వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి అలంకరణ



దిలావర్‌పూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద భక్తుల సందడి



పూనకంతో భక్తురాలు



బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు

సారంగపూర్/దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ గోదావరి పరీవాహక ప్రాంతం ఆదివారం తెల్లవారుజామున భక్తజన సందోహంతో పులకించింది. అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాల ఊరేగింపు శోభాయాత్ర శనివారం ఉదయం సారంగపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాగింది. రాత్రి సాంగ్వి పోచమ్మ ఆలయానికి చేరింది. భారీగా తరలివచ్చిన భక్తులు శనివారం రాత్రంతా పోచమ్మ ఆలయ పరిసరాల్లో అమ్మ వారి నామస్మరణ చేస్తూ జాగరణలో పాల్గొన్నారు. గంగా నీకు శరణమే...ఘనమైన పూజలే... ఉయ్యాలో ఉయ్యాలో...ఊరూవాడ జంపాలో... పోచమ్మ తల్లీ.. సల్లంగ చూడమ్మో.. అంటూ అమ్మ వారి ఆభరణాలను ఆదివారం తెల్లవారుజామున గోదావరి నదీ తీరానికి తీసుకెళ్లారు. అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నగలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అడెల్లి ఆలయానికి తిరుగుపయనమయ్యారు. భక్తులు గోదావరి జలాలను గడముంతల్లో తీసుకుని అమ్మవారి ఆభరణాల వెంట నడిచారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్ర కు ఘనస్వాగతం పలికారు. దిలావర్‌పూర్‌కు చేరుకోగానే గ్రామస్తులు జాలుక దండ(భారీపూల తోరణం)తో స్వాగతం పలికారు. పోతరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి యాటపిల్లలను (గొర్రె పొట్టేళ్లు)బహూకరించారు. శివసత్తుల పూనకాల మధ్య శోభాయాత్ర ముందుకుసాగింది. దారి పొడవునా అమ్మవారి ఆభరణాలపై పసుపు నీళ్లు చల్లుతూ, టెంకాయలు కొడుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

**ముగిసిన జాతర**

అడెల్లి మహాపోచమ్మతల్లి గంగనీళ్లజాతర ఆదివారం ముగిసింది. శనివారం రాత్రి నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నిజ మాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని యావత్‌మాల్, నాందేడ్,చంద్రాపూర్‌జిల్లాలనుంచి, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలనుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో స్నానం ఆచరించి దర్శనానికి క్యూ కట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, గంగానది జలాలతో ఆలయశుద్ధి, అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం, అనంతరం పవిత్రోత్సవం, తది తర పూజా కార్యక్రమాలు జరిపించారు.

**పోలీసు బందోబస్తు...**

నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ రామకృష్ణ, సారంగపూర్ ఎస్సై శ్రీకాంత్, దిలావర్‌పూర్ ఎస్సై సందీప్‌తో పాటు ప్రత్యేక పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

**భారీ ఏర్పాట్లు...**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. అడెల్లి ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేశ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సారంగపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేదవ్యాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని ఆదివారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రమేశ్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు.

**ఊరూరా మంగళహారతులు**

దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామం నుంచి అమ్మవారి నగలు ఊరేగింపుగా తీసుకువస్తుండగా ఆయా గ్రామాల్లో భక్తులు, గంగపుత్రులు తమ వలలతో గొడుగుపట్టి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేరల వరకు సాగనంపారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు



శివసత్తుల పూనకాలు

# తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇతరులను నిందించడం సరికాదని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా, ఫార్వర్డ్ చేసినా.. వారిపై, అలాగే గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం ఆదివాసీ మహిళ సాధారణ మరణంపై ప్రస్తుతం కొందరు వీడియోలు పోస్టు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మార్చి 2న ఆదివాసీ మహిళ బోథ్ పీహెచ్‌సీలో చేరి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకుందని, మరుసటి రోజు ఆమె డిశ్చార్జ్ అయినట్లు పేర్కొన్నారు. మార్చి 14న ఇంటి వద్ద మృతిచెందిన మహిళ మరణంపై కుటుంబీకులు ఫిర్యాదు చేయగా, బోథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు చెప్పారు. పోస్టు మార్టం రిపోర్టు ఆధారంగా ఈ కేసు మార్చి 31న అనారోగ్యంతో మరణించినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కొంత మంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాట్సాప్ గ్రూపుల్లో వైద్యులను కించపర్చేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతీ విషయం నిజమని నమ్మకూడదని సూచించారు.

## ప్రశాంతంగా ‘ఓపెన్’ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నిర్వహించిన టెన్త్ పరీక్షలకు ఇద్దరు, ఇంటర్ పరీక్షలకు 17 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 43 మందికి గాను37మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు ఐదుగురికి గాను నలుగురు హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు.

## క్లుప్తంగా

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో గల ఓ నూతన భవనం వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. మృతుడు కొద్దిరోజులుగా భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతునికి సుమారు 40 నుంచి 50 ఏళ్ల వరకు ఉంటాయని, మృతదేహాన్ని గుర్తించినవారు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వివరాలు తెలిస్తే 8712659524, 8712659523 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఎర్రకుంట చెరువులో మరొకరు..

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామ ఎర్రకుంట చెరువులో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై హ న్మాండ్లు తెలిపారు. మృతుడు చామన ఛాయ రంగు, 5 అడుగుల ఎత్తు, తెల్ల చొక్కా, స్కై బ్లూ కలర్ బనియన్, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 8712659518, 87126 59514 నంబర్లలో సంప్రదించాలన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### యువకుడి ఆత్మహత్య

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కొత్తచెరువులో దిలావర్‌పూర్‌కు చెందిన ఆడెపు రాజు(37) చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న రాజు శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం ఉదయం కొత్తచెరువులో మృతదేహం ఉందంటూ సమాచారం అందగా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి దిలావర్‌పూర్‌కు చెందిన ఆడెపు రాజుగా గుర్తించినట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

### పురుగుల మందు తాగి మరొకరు..

కౌటాల(సిర్పూర్): మండలంలోని పార్డి గ్రామానికి ఖోబ్రగడే మనోహర్(28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహర్‌కు ఏడేళ్ల క్రితం వివాహం కాగా.. అతడి భార్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. వైద్యం చేయించడానికి డబ్బులు లేక మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండటంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు మనోహర్‌ను గమనించి కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



# అభయారణ్యంలో సైక్లింగ్



అడవిలో సరదాగా అధికారులతో సైక్లిస్టులు

- వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరైన నాలుగు జిల్లాల సైక్లిస్టులు

జన్నారం: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవ్వాల్ అభయారణ్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సైక్లిస్టులు ఇందులో పాల్గొన్నారు. పచ్చని అడవిలో, పక్షులకిలకిలారావాల మధ్య ఉత్సాహంగా గడిపారు. జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్ సింగ్ ఆదేశాల మేరకు జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట్ రేంజ్‌లో ఈ సైక్లింగ్ నిర్వహించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, హైదరబాద్ జిల్లాలకు చెందిన 30 మంది సైక్లిస్టులు హాజరయ్యారు. ఉదయం 5 గంటలకు తాళ్లపేట్ రేంజ్‌లోని ఆలాద్రి నుంచి ప్రారంభించి ఊట్ల వరకు 20 కిలోమీటర్ల దూరంలోని టైగర్‌జోన్ బఫర్ ఏరియా వరకు సైక్లింగ్ కొనసాగించారు. వారి వెంట తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు, ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ సిబ్బంది కూడా సైక్లింగ్‌లో పాల్గొన్నారు. అడవులపై, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సైక్లిస్టులు అడవులు, వన్యప్రాణుల విశిష్టత గురించి తెలియజేశారు.

### గొప్ప అనుభూతి..



సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో మేము నిత్యం సైక్లింగ్ చేస్తాము. రోడ్లు, వాహనాల శబ్దాల మధ్య సైక్లింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అడవిలో 20 కిలోమీటర్లు సైక్లింగ్ చేయడం గొప్ప అనుభూతి ఇచ్చింది. పచ్చని అడవులు, స్వచ్ఛమైన గాలిలో చాల ఎంజాయ్ చేశాం. – నర్సింహారెడ్డి, సైక్లిస్టు కరీంనగర్

### పచ్చని ప్రకృతిలో సైక్లింగ్..



పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, వన్యప్రాణుల పరుగుల మధ్య సైక్లింగ్ గొప్ప అనుభూతి. చాలా ఎంజాయ్ చేశాం. మధ్యమధ్యలో వన్యప్రాణులు, పారే సెలయేళ్ల మధ్య సైక్లింగ్ చేశాం. అటవీశాఖ అధికారులు మంచి అవకాశం కల్పించారు. – శేఖర్, సైక్లిస్టు హైదరాబాద్

### అవగాహన కల్పించేందుకే..



అడవులు, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు ఏటా వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశాల మేరకు సైక్లింగ్ నిర్వహించాం. సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సుష్మారావు, రేంజ్ అధికారి, తాళ్లపేట్

## కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపునకు కృషి



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదలకు కృషి చేస్తామని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణికి గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లో వాటా పంపిణీపై కొన్ని సంఘాలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నాయని తెలిపారు. లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు వాటా ఇప్పించిన ఘటన ఏఐటీయూసీదే అన్నారు. కేకే ఓసీలో విధులు నిర్వహిస్తున్న ఓబీ కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడంలో జాప్యంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీఎండీతో మాట్లాడి వేతనాలు చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అక్బర్ అలీ, మల్లేశ్, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా జట్టుకు ద్వితీయస్థానం



ట్రోఫీ అందుకుంటున్న బాలుర జట్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): కామారెడ్డిలో జరిగిన 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. ఈ నెల 4 నుంచి 5 వరకు జరిగిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు అండర్ 19 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు రంగారెడ్డి జిల్లా జట్టుతో హోరాహోరీగా తలపడింది. స్వల్ప తేడాతో ఓడి ద్వితీయస్థానంలో నిలిచింది. జిల్లా క్రీడాకారులను బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, టగ్ ఆఫ్ వార్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, షార్ప్‌స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

## ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎరుకల కులస్తులు

చెన్నూర్: ఊరికి దూరంగా గుడిసెల్ల నివసిస్తూ దుర్భర జీవనం సాగిస్తున్న ఎరుకల కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రూ.50 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు కోరారు. జిల్లా అధ్యక్షులు దుగ్యాల బాపు అధ్యక్షతన ఆదివారం స్థానిక పెద్ద చెరువు రావి చెట్టు నుంచి పాత బస్టాండ్‌లోని అంబేద్కర్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడారు. అడవుల్లో లభించే వనరులతో తట్టలు, బుట్టలు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. రెడీమేడ్ రంగంతో కులవృత్తులు నాశనం అయ్యాయని తెలిపారు. ఎరుకల కులస్తులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెన్నూర్ నియోజకవర్గంలో ఏకలవ్య కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీరాములు, వివిధ జిల్లాల అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, రేవెల్లి రాజలింగు, రమేశ్, బండి సమ్మయ్య, సుభాష్, రాము, రవి, పోశం, సాయిలు, ఉండ్రాళ్ల పోచం, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## 30 మంది ఆదివాసీలకు 'బండి' ఆర్థికసాయం



చెక్కులు అందిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: జైనూర్ ఘటన తర్వాత జరిగిన అల్లర్లలో అరెస్టయిన 30 మంది ఆదివాసీలకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ వ్యక్తిగత నిధుల నుంచి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారని బీజేపీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. మొత్తం 30 మంది జైలుకు వెళ్లగా.. కరీంనగర్ జైలు నుంచి విడుదలైన 27 మందికి బండి సంజయ్ నేరుగా చెక్కులు అందించారన్నారు. ఆసిఫాబాద్ సబ్ జైలు నుంచి విడుదలైన మిగిలిన ముగ్గురికి ఆదివారం చెక్కులు అందించామని తెలిపారు. పోలీసులు అమాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ శ్రావణ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, జైనూర్ మండల అధ్యక్షుడు ఆత్రం అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చలు విఫలం.. ముదురుతున్న వివాదం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యానికి, కాగజ్‌నగర్ లారీ యజమానుల సంఘానికి మధ్య వివాదం ముదురుతోంది. పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా వాహనాలకు చెల్లించే కిరాయిలను పెంచడంతోపాటు ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కాగజ్‌నగర్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీల యజమానులు, డ్రైవర్లు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 46 లారీల్లో పేపర్ లోడ్ చేసుకుని స్థానిక లారీ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట రోడ్డుకిరువైపులా నిలిపివేశారు. ప్రతిరోజూ మిల్లులో 300 టన్నులు పేపర్ ఉత్పత్తి జరుగుతుండగా, సమ్మె కారణంగా ఆటంకం ఏర్పడింది. ఉత్పత్తి చేసిన పేపర్ ఎగుమతి కాకపోవడంతో మిల్లులోనే పేరుకుపోయింది.

### సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చర్చలు

ఇరువర్గాల మధ్య సయోధ్య కోసం శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ శ్రీనివాసరావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఉన్నతాధికారులు చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చర్చలు జరిపారు. మూడు గంటలపాటు సాగిన చర్చలు మళ్లీ విఫలం కావడంతో సమస్య మొదటికొచ్చింది. ప్రస్తుతం మిల్లు యాజమాన్యం దేశంలోని 14 స్టేషన్‌లకు మాత్రమే పేపర్ సరఫరా చేసేందుకు అనుమతి ఇస్తుందని, తమకు 38 స్టేషన్‌లలో పేపర్ సరఫరా చేసే అనుమతి ఇవ్వాలని లారీ యజమానులు పట్టుబట్టారు. మిల్లు యాజమాన్యం దానికి అనుకూలంగా స్పందించారు. మిగిలిన ధరల పెంపు, ఇతర డిమాండ్ల కోసం మెట్టు దిగకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. కాగజ్‌నగర్ లారీ యజమానులకు పక్కనే ఉన్న బల్లార్షా పేపర్ మిల్లు, రాజమండ్రి పేపర్‌మిల్లుతో పోల్చితే ఆశించిన స్థాయిలోనేకిరాయి చెల్లిస్తున్నామని మిల్లు ప్రతినిధులు వెల్లడించారు. పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా కిరాయిలు పెంచకపోతే సోమవారం నుంచి ముడిసరుకు లోడుతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే లారీలను అడ్డుకుంటామని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కిశోర్‌బాబు తేల్చిచెప్పారు.

## నాన్నకు టిఫిన్ ఇచ్చేందుకు వెళ్లి..

- నీటిగుంతలో పడి కొడుకు మృతి
- టేకుమట్లలో ఘటన



కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు



అన్నతో రాజ్‌కుమార్(ఫైల్)

జైపూర్: పశువులను మేతకు తోలుకెళ్లిన తండ్రికి మధ్యాహ్నం టిఫిన్ ఇచ్చేందుకు వెళ్లిన కొడుకు నీటి గుంతలో పడి మృతిచెందిన ఘటన టేకుమట్లలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిప్పకుర్తి రమాదేవి-విష్ణువర్ధన్ దంపతులకు రోహిత్, రాజ్‌కుమార్, రాఘవైష్ణవి సంతానం. విష్ణువర్ధన్ దివ్యాంగుడు. దీంతో పశువులను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతని రెండో కుమారుడు రాజ్‌కుమార్(14) ఇందారం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. విష్ణువర్ధన్ రోజూమాదిరిగానే ఆదివారం ఉదయం పశువులను సమీపంలోని రైల్వే ట్రాక్‌లైన్ వద్దకు మేతకు తోలుకెళ్లాడు. దరసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు ఇంటి వద్దే ఉండడంతో రమాదేవి మధ్యాహ్నం పిల్లలతో భోజనం పంపించింది. రోహిత్, రాజ్‌కుమార్ ఇద్దరూ టిఫిన్ బాక్సు తీసుకుని వెళ్లారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి ఎస్టీపీపీకి బొగ్గు రవాణా చేయడాని నిర్మించిన రైల్వేట్రాక్‌లైన్ పక్కన మట్టి కోసం తవ్విన గుంతల్లో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచింది. గుంతలకు అవతలివైపు తండ్రి ఉండడంతో గుంతల పక్క నుంచి వెళ్తుండగా రాజ్‌కుమార్ అదుపుతప్పి గుంతలో పడ్డాడు. వెంటనే రోహిత్ తండ్రి వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లి జరిగింది చెప్పాడు. విశువర్ధన్ ఘటన స్థలానికి చేరుకుని కొడుకును కాపాడే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే నీటమునిగిపోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు వదలడంతో విష్ణువర్ధన్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. రైల్వేట్రాక్‌లైన్ నిర్మాణం కోసం తవ్విన గుంటలను పూడ్చకపోవడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. సింగరేని అధికారులు నిర్లక్ష్యంతోనే రాజ్‌కుమార్ మరణించాడని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒక్కరి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పినా ఆందోళన విరమించలేదు. సింగరేణి అధికారులు స్పందించకపోవడంతో రాత్రి వరకు ఆందోళన చేశారు.

## కరెన్సీనోట్లతో అమ్మవారికి అలంకరణ



కరెన్సీనోట్లతో అలంకరించిన దుర్గామాత

భైంసాటౌన్: పట్టణంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక భవానీచౌక్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతతో పాటు ఆయా కాలనీల్లో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. వాసవి నగర్‌లోగల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.5.11 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అపూర్వ సమ్మేళనం




దండేపల్లి: జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 ఎసెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 25 ఏళ్లక్రితం పదో తరగతి పూర్తి చేసుకుని విడిపోయి.. ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తి పనులు చేసుకుంటూ జీవితంలో స్థిరపడ్డారు. వారంతా మళ్లీ చదివిన బడిలోనే కలుసుకోవడంతో వారిసంతోషానికి అవధులు లేకుండా పోయాయి. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు. జ్ఞాపికలు అందించారు. ఆశీర్వాదం తీసుకున్నారు.

### మంచిర్యాలలో..



గురువులతో కలిసి పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రామకృష్ణాపూర్‌కు చెందిన నవోదయ మోడల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహాసమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 19 ఏళ్ల తర్వాత కలిశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. – మంచిర్యాలరూరల్/రామకృష్ణాపూర్

### బెల్లంపల్లిలో..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

బెల్లంపల్లి సర్వోదయ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదో తరగతి విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత స్థానిక తాపీ సంఘ భవనంలో కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, సూరమ్మ, రవి, బానేష్, నజీర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. – బెల్లంపల్లి

## అమ్మవారిని దర్శించుకుని వస్తూ.. కానరాని లోకాలకు

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు హర్షవర్ధన్ (ఫైల్)



సంఘటన స్థలంలో ప్రమాదానికి గురైన యువకులు

ఆదిలాబాద్‌టౌన్/జైనథ్: మహారాష్ట్రలోని కేళాపూర్‌లో అమ్మవారిని దర్శించుకుని వస్తూ ఓ యువకుడు కానరాని లోకాలకు చేరిన ఘటన జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన 16మంది యువకులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు. శనివారం మహారాష్ట్రలోని కేళాపూర్ దుర్గాదేవి దర్శనం కోసం వారంతా బైక్‌లపై బయలుదేరారు. అమ్మవారిని దర్శించుకొని వేకువజామున ఐదు గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణం అయ్యారు. ఇందులో ఇందూరి హర్షవర్ధన్(18), నీరజ్‌రెడ్డి బైక్‌పై వస్తూ జైనథ్ మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా, నీరజ్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. హర్షవర్ధన్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. కాగా, మృతుడి తల్లి దేవమ్మ ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందడం గమనార్హం. బంధువులు రోధించిన తీరు అందరిని కలచివేసింది.

## విహారం.. విషాదం

- జలపాతంలో మునిగి విద్యార్థి మృతి
- కొంగాల సమీపంలోని దుసపాటి లొద్దిలో ఘటన



వాజేడు: అభినయ్ మృతదేహం

వాజేడు: విహారం.. విషాదమైంది. ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలో ఉన్న దుసపాటి లొద్ది జలపాతంలో మునిగి ఓ విద్యార్థి మృతి చెందాడు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన బండారి శ్రీనివాస్ కుమారుడు అభినయ్(18) మరో ఆరుగురు మిత్రులతో కలిసి శనివారం సాయంత్రం వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతానికి వచ్చారు. అప్పటికే బొగత జలపాతం ప్రవేశం మూసివేయడంతో చీకుపల్లిలోనే బస చేశారు. ఆదివారం ఉదయం కొంగాల సమీపంలోని దుసపాటి లొద్దిని చూసేందుకు వెళ్లారు. ఈ సమయంలో అటవీ శాఖ సిబ్బంది లేకపోవడంతో జలపాతంలోకి దిగారు. అభినయ్‌నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో వారు వాజేడు ఎస్సై హరీశ్‌కు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లతో గాలించగా అభినయ్ మృతదేహం లభించింది. విషయాన్ని పోలీసులు వెంటనే తల్లిదండ్రులకు తెలిపారు. అభినయ్ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ ఈఈఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.